# వసంత కోకిల

గుండ్రని మొహం... గిరిజ నవ్వుతూంటే పున్నమి వెన్నెల కదిలినట్లుంటుంది. ఆ అందాలరాశి మనోఫలకమ్మీద అల్లరి చేస్తుంటే అవినాశ్ అంతరంగ తరంగాల్లో వింత సవ్వడి గోచరిస్తుంది. ఇద్దరూ ఒకేసారి యం.బి.ఏ. పాసయ్యారు.

అవినాశ్ త్వరలోనే సొంత ఫ్యాక్టరీ బాధ్యతలు చేపట్టబోతున్నాడు. చెట్టాపట్టా లేసుకుని సినిమాలకు, షికార్లకు తిరగిన గిరిజతో అమెరికాకు హనీమూన్ కెళ్లినట్టు, నయాగారా జలపాతంలో సరిగంగ స్నానాలు చేసినట్టు... ఊహల్లో తేలిపోతున్నాడు.

అమ్మానాన్నలను ఒప్పించి వాళ్లింటికి పెళ్లిచూపుల కెళ్లాడు. గిరిజ వాళ్ల ఇల్లు మహారాజ ప్యాలెస్‌లాగుంది. చుట్టూ ప్రహరీ గోడ, గోడనానుకుని రకరకాల పూలమొక్కలు లాన్ మధ్యలో మామిడి చెట్లు, ఇంటి ముందు వేపచెట్టు రెమ్మలాడిస్తూ స్వాగతం పలికాయి. ఆ నందన వనములోంచి ఇంట్లోకెల్తూంటే మనసు మయూరమై గంతులేసింది. పెళ్లి చూపుల్లో గిరిజ అప్సరసలా కబడింది. ఇద్దరూ ఒక్కటయితే ఎంతహాయి. మనసు తియ్యగా మూల్గింది. అమ్మాయి, అబ్బాయి ప్రేమించుకున్నారని తెలిసి తల్లిదండ్రులు అభ్యంతరం లేదన్నారు. లాంఛనాలన్నీ పూర్తయాక గిరిజ తండ్రి శివరామయ్య మధ్యవర్తి చెవిలో ఏదో ఊదాడు. అవినాశ్, అతని తండ్రి సత్యనారాయణ మొహాలు చూసుకున్నారు.

మధ్యవర్తి మందహాసం చిందిస్తూ "సత్యనారాయణ గారూ! శివరామయ్య గారు మీ ఊరికొచ్చి మీ ఇల్లు వగైరాలు చూసింతర్వాత ఫైనల్ అభిప్రాయం చెప్తారట" కుండబద్దలు కొట్టాడు.

ఆడపిల్ల తండ్రికంత టెక్కా? సత్యనారాయణ కదేమీ బాగనిపించలేదు. పైకిమాత్రం సరేనన్నాడు.

ఝుమ్మంటూ కారులో అవినాశ్ ఇంటి కొచ్చిన శివరామయ్య ఒళ్లంత కళ్లు చేసుకుని ఇల్లంతా కలియజూశాడు. ఫ్యాక్టరీని పరిశీలించాడు. మెషనరీల సంగతి అడిగి తెలుసుకున్నాడు. వెంటనే తిరిగి వెళ్లి ఫోన్‌లో చెప్పాడు. "మీ ఇంటి, ఫ్యాక్టరీ వాతావరణం నాకు నచ్చలేదు. గిరిజను మీ ఇంటికివ్వాలంటే కొన్ని షరతులున్నాయి" నిర్మొహమాటంగా చెప్పాడు. అది సత్యనారాయణను అల్లకల్లోలం చేసింది. "మీరు మాకు షరతులు విధిస్తారా?" నిలదీశాడు.

"అవును... పెళ్లయాక మా గిరిజ మీ ఇంట్లోనే ఉండాలి గదా..." ఇంకేదో చెప్పబోయాడు శివరామయ్య. ఠపీమని ఫోన్ కట్ చేశాడు.

కొడుకు, భార్యనూ పిలిచి "ఆఫ్టరాల్ ఆడపిల్ల తండ్రి మనకు షరతులు విధిస్తాడటా. ఆ సంబంధం మనకొద్దు" అగ్గిమీద గుగ్గిలమై పోయాడు. పంజేస్తున్న కంప్యూటర్ పేలిపోయినట్టనిపించింది అవినాశ్‌కు. తండ్రి మాటకెప్పుడూ ఎదురు చెప్పలేదు. ఇప్పుడు అలాగే ఉంటే జీవితమంతా దేవదాసులా గడపాలి" నాన్నా! పెళ్లంటూ చేసుకుంటే గిరిజనే చేసుకుంటా" ధైర్యంగా అనేశాడు.

పచ్చిమిరపకాయ పంటికింద కొచ్చినట్టైయింది సత్యనారాయణకు. కాని... చెట్టంత కొడుకుతో ఫ్రెండ్లీగా మాట్లాడాలని గుర్తుకొచ్చింది. "కనిపెంచిన మాకంటే ఆ అమ్మాయే ఎక్కువైందా?" గుడ్లురిమాడు.

"అదంతా నాకు తెలీదు. నువ్వన్నా చెప్పమ్మా" తల్లినడిగాడు తనయుడు. అమ్మ అంతరాళాల్లో అష్టమ సముద్రం పొంగింది.

"ఏమండీ! మనకొక్కగానొక్క కొడుకు. గారాబంగా పెంచాము. వానికి నచ్చిన అమ్మాయితోనే పెళ్లిచేస్తే బాగుంటుంది గదా!" గుండెలు గుప్పిట్లో పెట్టుకుని సముదాయించింది.

ఎగదన్నుకొస్తున్న ఆవేశాన్నాపుకోలేక సత్యనారాయణ "అయితే మాత్రం ఆయన షరతులకు మనం తలొగ్గాలా?" అంటూ సతమతమైపోతున్నాడు. తల్లిలో తెగింపు తోసుకొచ్చింది.

"కాలం మారిందండీ. ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది." గుర్తుచేసింది. ఆఫ్‌చేసిన కంప్యూటర్లాగయ్యాడు సత్యనారాయణ. "ఆ మాట నిజమే. కానీ... ఆ షరతులెలాంటివో గదా!" గట్టిగా ఊపిరి పీలుస్తూ సోఫాకొరిగాడు. అవినాశ్ చూపులు తల్లిని తడిమాయి. "ఆ షరతులేమిటో కనుక్కుందాం. మీరు వెళ్తారా లేక ఆయన్నే రమ్మంటారా?" అడిగిందామె.

"ఆయన్నే రమ్మను" సత్యనారాయణ భేషజం.

ఫోన్‌లో మాట్లాడారు. శివరామయ్య, వెంటనే బయలుదేరాడు. ఎందుకైనా మంచిదని గిరిజకు ఫోన్ చేశాడు అవినాశ్.

"గిరిజా! పెద్దలు అంగీకరించకపోతే ఏం చేద్దాం?" అడిగాడు.

"పెద్దల మాట చద్దిమూట గదా!" ఫోన్ కట్టయింది.

స్వైన్ ఫ్లూ సోకినట్టు వెన్నుపూసలో సన్నని వణుకుతో అవినాశ్ సతమతమవుతూంటే ఇంటిముందు కారాగింది. శివరామయ్య అతని వెంటున్న మధ్యవర్తి దిగారు.

సత్యనారాయణ దంపతులు స్వాగతించారు. కమ్మని కాఫీ నరాల నుత్సాహపరిచింది.

"శివరామయ్యగారూ!" మధ్యవర్తి ప్రారంభించాడు. "అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకున్నారు. మధ్యలో ఈ షరతులేమిటీ?" సూటిగా అడిగాడు.

శివరామయ్య వాలకం గంభీరమైంది. మనసులోని మాట నెలా చెప్పాలని కాస్సేపు తటపటాయించాడు. ఆ తర్వాత "పుట్టింట్లో ఆరోగ్యంగా పెరిగిన మా గిరిజ మెట్టింట్లో గూడా ఆరోగ్య సౌభాగ్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను. మీ అబ్బాయి, మీ దంపతులు మాకు బాగా నచ్చారు సత్యనారాయణ గారూ!" అన్నాడు.

"మరింకేమిటటా?" సత్యనారాయణ రోషం.

"మీ ఇంటి వాతావరణం, ఫ్యాక్టరీ వాతావరణం నచ్చలేదు" కరాఖండిగా చెప్పేశాడు శివరామయ్య. మధ్యవర్తి కదేమీ నచ్చలేదు.

"అదెలాగా? కోటి రూపాయల బంగళా, వందలకోట్ల విలువైన ఫ్యాక్టరీ నచ్చలేదా?" నోరెళ్లబెట్టాడు.

"అవును.... ఇల్లు అగ్గిపెట్టెలాగుంది".

"అయ్యయ్యో! అన్ని అంతస్తుల బంగళా కిటికీలు...మోడ్రన్ కలర్స్... అన్ని గదుల్లో ఏ.సీ..." ఇంకేదో చెప్పబోయాడు మధ్యవర్తి.

"ఎన్ని అంతస్తులుంటే ఏం?" శివరామయ్యందుకున్నాడు. "ఇంటి చుట్టూ కనీసం పూలమొక్కలు కూడా లేవు. ఓ పక్క మురుగు కాల్వ. శుభ్రమైన గాలి ఎలా వస్తుందీ?" నిలదీశాడు.

"కిటికీలున్నాయి గాని వాటిలోంచి మంచి గాలి ఎలా వస్తుందీ? ఇంటి ముందు గానీ, వెనకగానీ ఒక్క చెట్టైనా ఉందా?"

"అవున్నాన్నా!" అవినాశ్‌లో హుషారు, "చెట్లు బొగ్గుపులుపు వాయువుల్ని విడుదల చేసి ఆక్సిజన్ను విడుదల చేస్తాయిగదా! అది ప్రాణవాయువు. ప్రాణంతో సమానం"

"దాంతో నీకేం నష్టమయ్యా శివరామయ్యా?" మధ్యవర్తి బుర్ర గోక్కున్నాడు.

శివరామయ్య నవ్వాడు "అస్తమానం ఏ.సి. గదుల్లో ఉంటే ఆరోగ్యం చెడిపోదా? దానికి తోడు చల్లని చెట్లగాలి ఉండాలి. వీళ్లింట్లో కనీసం ఓ తులసి మొక్క గూడా లేదు. పచ్చని చెట్టు ప్రగతికి మెట్టు అన్నారు గదా పెద్దలు".

మరిచిపోయిన పాఠం సత్యనారాయణ దంపతులకు గుర్తుకొచ్చింది. "మరిప్పుడేం చెయ్‌మంటారన్నయ్యా?" అడిగింది శ్రీమతి సత్యనారాయణ.

"ఇంటి చుట్టూ వున్న ఖాళీ స్థలంలో మొక్కలు నాటించండి. ప్రహరీగోడ కట్టించండి. మురికినీరును పైపులద్వారా తీసుకెళ్లి బజారు డ్రైనేజికి కలపండి."

"మన మున్సిపాల్టివాళ్లు అదే అన్నారు గదా నాన్నా. అసలా మురికి నీటి దుర్వాసనతోనే గదా అమ్మకు అనారోగ్యం. నీ గ్గూడా ప్రతినెలా జ్వరమో ఏదో వస్తుందాయే" అనేశాడు అవినాశ్. సత్యనారాయణ దంపతులు అదంతా నిజమేనన్నట్టుగా మొహాలు చూసుకున్నారు.

"అవన్నీ చేయిస్తాను" సత్యనారాయణ స్పందించాడు. "కాని బంగారం లాంటి ఫ్యాక్టరీ కేమైందంటా?

"ఫ్యాక్టరీకి పోదాం పదండి. అక్కడే చెప్తా" అంటూ లేచాడు శివరామయ్య.

అంతా కలిసి ఫ్యాక్టరీ కెళ్లారు. నేరుగా ఆఫీసులో కెళ్లి కూచున్నారు. అటెండర్ థర్మాసుఫ్లాస్క్‌లోంచి ప్లాస్టిక్ గ్లాసుల్లోకి వేడిచాయి వంచబోతున్నాడు.

"ఆగు బాబూ! ప్లాస్టిక్ గ్లాసుల్లో వద్దు" శివరామయ్య వారించాడు. "కప్పుల్లో ఇవ్వు. ప్లాస్టిక్ పర్యావరణానికి హాని చేస్తుంది."

"సరే సార్!" అటెండర్ నుండి కప్పందుకుంటూ సత్యనారాయణ "మీరు బలేవారండీ. ఈ రోజుల్లో ప్లాస్టిక్ గ్లాసులే ఫ్యాషన్ గదా! అందరూ ఇవే వాడుతున్నారు గదా!" లోపలి కుతకుత బయటపడకుండా జాగ్రత్తపడ్డాడు.

"మేం వాడడం లేదండీ" శివరామయ్య వేడి చాయ సేవిస్తూ వాడిగా చూశాడు. "ప్లాస్టిక్ కాలుష్యం పవర్‌ఫుల్. ప్లాస్టిక్‌ను భూమిలో పాతిపెట్టి ఎన్నాళ్లుంచినా అరగదు తరగదు. విషవాయువుల్ని విడుదల చేస్తుంటుంది. ఇలాంటి విషవాయువులే ఆకాశానికి రక్షణగా వున్న ఓజోన్ పొరకు తూట్లు పొడుస్తున్నాయి. అందుకే సూర్యప్రతాపాన్ని ఓజోన్‌పొర సరిగా అడ్డుకోలేక ఏటేటా వేడి పెరిగి పోతోంది. అగ్రరాజ్యాలు ప్లాస్టిక్ వస్తువుల్ని సముద్రంలో పారేస్తున్నాయి. దానివల్ల సముద్ర జీవులు చస్తున్నాయి." గడగడా చెప్పేశాడు.

మధ్యవర్తి చాయ కప్పు టీపాయ్ కప్పగిస్తూ "నిజమే నండీ అందుకే ఏటేటా ఎండలు మండిపోతున్నాయ్" అన్నాడు.

"మీరు మీ రైసుమిల్లులో ప్లాస్టిక్ బ్యాగులు వాడడం లేదాండీ?" అవినాశ్ సందేహం వెలిబుచ్చాడు.

"లేదు బాబూ! గోనెసంచులే వాడుతున్నాం". హుషారుగా చెప్పాడు శివరామయ్య "అంతేకాదు బాబూ! ఈ ఏ.సీలు, ఫ్రిజ్‌ల వాడకం వల్ల గూడా వాతావరణం కాలుష్యం ఏర్పడుతుంది."

సత్యనారాయణ ఊరుకోలేక "ఈ హైటెక్ యుగంలో శాస్త్ర విజ్ఞానము అభివృద్ధి చెందింది. మనమలా ఆలోచిస్తే ఎలా?" అడిగేశాడు.

"శాస్త్ర విజ్ఞానం నిప్పు లాంటిది" శివరామయ్య చిన్నగా నవ్వాడు. "నిప్పుతో వంట చేసుకోవచ్చు, ఇల్లు తగులబెట్టుకోవచ్చు. అది మనిషి విచక్షణ మీద ఆధారపడి ఉంటుంది."

అంతా కలిసి బయటికొచ్చారు. ఫ్యాక్టరీ చుట్టూ తిరిగారు. శివరామయ్య గంభీరంగా "చూడండి. ఫ్యాక్టరీ చుట్టూ ఒక చెట్టన్నా, మొక్కన్నా ఉన్నదా?" అడిగాడు.

"చెట్లు స్థలాన్ని ఆక్రమిస్తాయి గదా! ఖాళీ స్థలములో చెట్లు పెంచే బదులు మరో ఫ్యాక్టరీ వెయ్యాలనుకుంటున్నాము" చాకచక్యంగా జవాబిచ్చాడు సత్యనారాయణ.

మేనేజర్ వచ్చి "సార్! మన ఎకౌంట్స్ సెక్షన్‌లో ఇద్దరు గుమస్తాలు జబ్బు పడ్డారు. రేపే జీతాలివ్వాలి. ఇంకా బిల్లులు తయారు కాలేదు." సవినయముగా చెప్పాడు. సత్యనారాయణకు చిరాకేసింది.

"ఛీఛీ ఎక్కడాలేని విధంగా మన ఫ్యాక్టరీ మనుషులే జబ్బుల పాలవుతున్నారు" అంటూంటే అంతా తిరిగి ఆఫీసులోకొచ్చి కూచున్నారు.

"దీనికి్కారణం వాతావరణ కాలుష్యమే నాన్నా!" అవినాశ్ అందుకున్నాడు. "మన ఫ్యాక్టరీ వ్యర్థ పదార్థాల మురికినీరు ఇక్కడే ఉండిపోయింది. వీటిలో దోమలు జొబ్బు మంటున్నాయి. ఆ దుర్గంధం తోనే అందరికీ రోగాలొస్తున్నాయి. మురికి నీరును పైపుల ద్వారా దూరం తీసుకెళ్లి వదిలేద్దాం నాన్నా!" అన్నాడు.

"అక్కడ గూడా కొన్ని రోజుల తర్వాత ఇండ్లు కట్టుకుంటారు. దాంతో మరో గొడవ గదా!" సత్యనారాయణ సందేహంలో కోపం తొంగిచూసింది.

"దానికో ఉపాయముందండీ!" శివరామయ్య అందుకున్నాడు. "ఈ రోజుల్లో ,మురికి నీరును మంచినీరుగా మార్చే యంత్రాలొచ్చినై. శుభ్రం చేసిన నీటిని మొక్కలకు, చెట్లకు వాడుకోవచ్చు. వెంటనే ఫ్యాక్టరీ చుట్టూ మొక్కలు నాటించండి" సలహా యిచ్చాడు.

మధ్యవర్తి తలగోక్కుంటూ "శివరామయ్య గారూ! వీటికి, వీళ్ల పెళ్లికి సంబంధమేముందండీ?" అసలు విషయం ప్రస్తావించాడు. "కట్నం లేకుండా చేసుకుంటా మంటే అలుసై పోయారా?" అసహనం వెలిబుచ్చాడు.

శివరామయ్య గుండెలనిండా ఊపిరి పీల్చుకున్నాడు. "పెళ్లైంతర్వాత మా గారాల పట్టి గిరిజ ఇక్కడే ఉంటుంది. ఈ కుటుంబ సభ్యురాలవుతుంది. నా కూతురు, అల్లుడూ, వాళ్ల కుటుంబ సభ్యులతో పాటు ఫ్యాక్టరీ... అంతా బాగుంటేనే మాకు సంతోషం గదా! అందరూ ఆరోగ్యంగా వుండాలని కోరుకుంటున్నా. ఆ తర్వాత మా అమ్మాయికే సమస్యలొచ్చినా మాకు మనశ్శాంతి ఉంటుందా?" ఆవేశంలో నిజాయితీ, ఆవేదనలో నిజం గోచరించాయి.

అంతా అవాక్కయ్యారు. "వేరే సెక్షన్ వాళ్లకు ఓవర్ టైమిచ్చి పని చేయండి" మేనేజర్‌కు చెప్పి పంపించాడు.

అవినాశ్ అంతరంగములో గిరిజ కదలాడింది.

"నాన్నా! ధర్మో రక్షతి రక్షితః అన్నట్లు పర్యావరణాన్ని మనం రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుంది. అంకుల్ చెప్పినవన్నీ చేయిద్దాం నాన్నా!" చేతులు జోడించి తల్లిని చూశాడు.

"నిజమే... సరేఅనండీ!" అందామె. సత్యనారాయణకంతా అవగతమైంది.

"సరేనండీ! మొక్కలు ఇక్కడా, ఇంటి వద్ద నాటిస్తాను. మురుగునీటిని పైపుల ద్వారా దూరం చేస్తాను. ప్లాస్టిక్ వాడకం మాన్పిస్తాను. సరేనా...!" అంటూ అందరినీ కలియజూశాడు. శివరామయ్య సంతోషంగా లేచి "మా అమ్మాయి అభిప్రాయం గూడా అదే బావగారూ! ఇప్పుడీ సంబంధం... ఓకే... శుభం" సత్యనారాయణ చేతులందుకుని కళ్ల కద్దుకున్నాడు.

అవినాశ్ మనోవనములో వసంతం వెల్లివిరిసింది. గిరిజ వసంతకోకిలై కమ్మని రాగాలు వినిపించింది.

--- x ---



(చేతన-అక్టోబర్ 2011)